లోప్రెషర్.. ప్రజల పరేషాన్!

● హైదర్‌గూడలో నల్లాల్లో అరకొరగానే నీరు ● మధ్యాహ్నం వస్తుండటంతో పట్టుకోలేకపోతున్న ప్రజలు
● నీటిని సరఫరా చేసే సమయాన్ని మార్చాలని డిమాండ్ ● అధికారులు పట్టించుకోక పోవడంపై ఆగ్రహం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో నల్లాల్లో మంచినీటి సరఫరా లోప్రెషర్‌తో వస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నల్లాల్లో లోప్రెషర్‌తో నీరు వస్తున్నా అధికారులు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉదయం వచ్చే నీరు ఇప్పుడు మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట మధ్యలో సరఫరా చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అన్నట్లు సిబ్బంది వ్యవహరిస్తున్నారు. వారికి ఇష్టమొచ్చినప్పుడు నీటిని సరఫరా చేయడంతో ప్రజల తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు.

◆ జలమండలి అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే తాగు నీటి సమస్యలు ఎదురవుతున్నాయి. గతంలోలా నీరు ఎక్కువగా అందించడం లేదని కొద్ది సేపటికి నీటి సరఫరా ఆపి వేస్తున్నారని వెల్లడిస్తున్నారు. వచ్చేదే లోప్రెషర్ నీరు అది కూడా ఎక్కువ సేపు సరఫరా చేయకపోవడంతో సమస్య తీవ్రం అవుతోంది. ప్రజలు ఇళ్లల్లో ఉన్న సమయంలో కాకుండా అందరూ పనులకు వెళ్లిన సమయంలో నీటి సరఫరా వదులుతున్నారు. అది కూడా ఎప్పుడో మిట్ట మధ్యాహ్నం వదులుతున్నారు. కూలీపనులు చేసుకుంటూ ఉదయాన్నే పనులకు వెళ్లే వారు అధికంగా ఉంటారు. ఈ ప్రాంతాల్లో నీటి సరఫరాను జలమండలి లైన్‌మెన్‌లు మిట్ట మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల మధ్యలో సరఫరా చేస్తున్నారు. ఈ సమయంలో ఇంట్లో నీళ్ల పట్టేందుకు ఎవరు ఉండటం లేదని నీరు పట్టేందుకు కూలీ పనులు మానుకోని ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి నీటి సరఫరాలో ప్రెషర్ పెంచడంతో పాటు ఉదయం సమయంలో నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉదయమే వదలాలి



నల్లాల్లో రోజు విడిచి రోజు వచ్చే తాగునీరు లోప్రెషర్‌తో వస్తున్నందున ఏమాత్రం అవసరాలకు సరిపోవడం లేదు. ప్రెషర్ పెంచి నీటిని సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. చాలీచాలని విధంగా నీరు వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మధ్యాహ్నం కాకుండా ఉదయమే నీటిని సరఫరా చేయాలి. పనులు మానుకొని నీటి కోసం ఇంటి వద్ద ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

– సాబాద ఆనంద్, హైదర్‌గూడ



హైదర్‌గూడలో మిట్ట మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నీటి సరఫరా అవుతున్న దృశ్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం



గోల్కొండ: ఏప్రిల్ 11న కార్వాన్‌లో జరిగే మహాత్మా జ్యోతి బాపూలే 198వ జయంతి ఉత్సవాలకు రావాల్సిందిగా కార్వాన్ బీసీ ఐక్య వేదిక ప్రతినిధులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. సోమవారం కమిటీ ప్రతినిధులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..జ్యోతిబాపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వంశీ, నర్సింగ్, అనిల్, వెంకటేష్, పంబి శ్రీనివాస్ తదితరులున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. భారతదేశంలోనే కాకుండా తెలంగాణలో వందల ఏళ్ల నుంచి వక్ఫ్ ఆస్తులు, ఈద్గాలు, మసీదులు ఉన్నాయని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన సవరణతో ఈ ఆస్తులన్నీ ప్రభుత్వ పరం అవుతాయని, ఇది భారత ముస్లింలకు ఆమోదయోగం కాదన్నారు. ముస్లింలందరూ ఐక్యంగా ఉండి వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకుంటామని ఆయన సూచించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకిస్తూ కుతుబ్‌షాహీ ఈద్గా వద్ద ప్రార్థనలకు వచ్చిన వారితో పాటు ఈద్గా కమిటీ ప్రతినిధులు చేతులకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలి

గన్‌ఫౌండ్రీ: దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు తెలంగాణ అసెంబ్లీలో బిల్లు పెట్టడం పట్ల ధన్యవాదాలు తెపుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం బహిరంగంగా లేఖ రాశారు. ఈ సందర్భంగా బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో పెంచిన బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని సూచించారు. దీన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే భారీ ఉద్యమాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ 2014 నుంచి బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా ప్రస్తుతం బీసీల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేయడం లేదని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమార్, వేణుయాదవ్, శ్రవణ్, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉండాలి

చాంద్రాయణగుట్ట: ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉండాలని తాండూర్ ఎమ్మెల్యే బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ సూచించారు. ఉప్పుగూడ ముదిరాజ్ సహకార సంఘం ఉగాది వేడుకలను తానాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా రుద్రారం అంజయ్య ముదిరాజ్, వైస్ చైర్మన్‌గా శ్రీమన్నారాయణ, అధ్యక్షుడిగా బర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జమ్మిచెట్టు రాజు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, కార్యదర్శిగా శ్రీనివాస్ ఆనంద్, కోశాధికారిగా సుధాకర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా బాలరాజ్, మోర సత్యనారాయణ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులతో చంద్రశేఖర్ ముదిరాజ్, సలహాదారులు శ్రీనివాస్, కాకి నరహరి, సుధీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉగాది పురస్కారాలు అందజేశారు.

బీసీల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం చేయాలి

గోల్కొండ: బీసీల హక్కుల సాధనకు బీసీ కుల సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాలని కార్వాన్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు కొల్లూరి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం కార్వాన్‌లో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పేద, బడుగు వర్గాల పోరాట యోధుడు జ్యోతి బాపూలే జయంతి ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి తీర్మానం చేశారు. వచ్చే నెల 11న జరగనున్న జ్యోతి బాపూలే జయంతి ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకుంటామని అనిల్‌కుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులను ఆహ్వానించడంతో పాటు బీసీ కులాలందరిని ఆహ్వానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్, కోశాధికారి జింక కృష్ణ, గౌరవ అధ్యక్షులు మల్లికార్జున్ అడికే, సీమల శంకర్ తదితరులున్నారు.

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

రాజేంద్రనగర్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. పూలే జయంతిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ జయంత్యోత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన బ్రోచర్‌ను సోమవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహనీయుల జీవిత చరిత్రను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఉత్సవాల్లో అందరినీ భాగస్వాములుగా చేయాలన్నారు. విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్రను వివరించేలా ఉత్సవ కమిటీ సభ్యులు చొరవ చూపాలన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణమాచారి, మాజీ అధ్యక్షులు డి.సత్యనారాయణ ముదిరాజ్, నేతలు కరణం యాదయ్య ముదిరాజ్, అడికే అర్జున్, భంగి శ్రీను, మల్లికార్జున్ గౌడ్, కొండల్ ముదిరాజ్, కాశీగారి యాదగిరి, ప్రస్తుత ఉత్సవాల అధ్యక్షుడు బండారి శంకర్, ఉపాధ్యక్షుడు ముదుమాల శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులు మామిళ్ల మహేశ్, దయానంద్, రాసారీ ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

బండ్లగూడ: మహనీయుల జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించి ఆదర్శంగా నిలవాలని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, కోశాధికారి మంగళారం శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో స్వామిగౌడ్, ప్రముఖ సంఘ సేవకులు గోకరి అర్జున్‌గౌడ్, ఉద్యోగ సంఘాల సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్‌లను కలిసి జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.



వేడుకగా మార్వాడీ మహిళా సమాజం ఊరేగింపు



అత్తాపూర్‌లో ఊరేగింపులో పాల్గొన్న మార్వాడీ మహిళా సమాజం సభ్యులు

అత్తాపూర్: అత్తాపూర్‌లో మార్వాడీ మహిళా సమాజం ఊరేగింపు వైభవంగా కొనసాగింది. హోలీ అనంతరం 16 రోజుల పాటు మార్వాడీ మహిళా సమాజం సభ్యులు ఉపవాస దీక్షలతో పార్వతి పరమేశ్వరులకు పూజలు నిర్వహించారు. సోమవారం అత్తాపూర్ పురవీధుల్లో సామూహిక ఊరేగింపు నిర్వహించారు. గంగోర్ పేరుతో నిర్వహించిన సామూహిక ఊరేగింపులో వందలాది మంది మార్వాడీ మహిళా సత్సంగ్ సభ్యులు పాటలు పాడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. అత్తాపూర్, రాంబాగ్, భరత్‌నగర్, రతన్‌నగర్ పురవీధుల్లో ఊరేగింపు కొనసాగింది. సంవత్సరకాలం పాటు తమ జీవితాల్లో సుఖశాంతులను ప్రసాదించాలంటూ భగవంతుడిని వేడుకుంటూ పాటలు పాడుతూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఊరేగింపులో మార్వాడీ మహిళా సత్సంగ్ సమితి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన రంగనాథుడి ఉత్సవాలు



రంగనాథస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



గోపన్‌పల్లిలో రంగనాథస్వామి ఊరేగింపు

రాయదుర్గం: రంగనాథస్వామి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం ఆలయం చేరువలో అవభృతస్నానం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అర్చకులు పంచాంగ పఠనం నిర్వహించారు. ఆలయంలో శతాబ్దాలుగా ఉగాది తరువాతి రోజు పంచాంగ పఠనం చేయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు రవీంద్రప్రసాద్‌దూబే, సభ్యులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

విజయనగర్‌కాలనీ: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి కె.రవితేజ తెలిపారు. సోమవారం ఆసిఫ్ నగర్ ఇంద్రానగర్‌లో నెలకొని ఉన్న శ్రీబుద్ది పోచమ్మ తల్లి, శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయాలలో ఆలయ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ..రాబోయే ఉత్సవా ల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చలువ పందిళ్లు, తాగునీరు తదితర సౌకర్యాల ఏర్పాట్లకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆగాపురాలో అగ్ని ప్రమాదం

నాంపల్లి: చెత్తకు నిప్పంటుకుని, ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన ఘటన ఆగాపురాలో చోటుచేసుకుంది. ఈ ఘటన సోమవారం హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆగాపురా చార్‌కాందిల్ సమీపంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగాపురా చారకాందిల్ సమీపంలో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ కింద స్థానికులు చెత్తను వేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం చెత్తకు నిప్పంటుకోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కాలిపోయాయి. ఈ మంటలు ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోక ముందే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఎగిసిపడుతున్న మంటలను అదుపుచేసి ప్రమాదాన్ని నిలువరించారు. సమీపంలోనే వాణిజ్య సముదాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు.



4 నుంచి లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలోని లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. 4న ఉదయం స్వస్తివాచనం, స్వామి వారికి నివేదన, సాయంత్రం అంకురార్పణ, పుట్టమన్నుతెచ్చుట, లఘు హోమం, స్వామి వారికి నివేధన, తీర్థప్రసాదాల కార్యక్రమాలు ఉంటాయన్నారు. 5వ తేదీన ఉదయం ధ్వజరోహణం, నిత్య హోమం, స్వామి వారికి అభిషేకం, సాయంత్రం నిత్య హోమం, మండపారాధన, స్వామి వారికి నివేదన, తీర్థప్రసాద గోష్టి నిర్వహిస్తామని వివరించారు. 6వ తేదీన ఉదయం పూర్ణాహుతి, శ్రీ సీతా రామచంద్రుల అభిషేకం, అనంతరం సీతారాముల కల్యాణం, అన్నదానం, సాయంత్రం శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి వారి కల్యాణం, శివపార్వతుల కల్యాణం, వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. బ్రహ్మోత్సవాలను యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వేదపండితులు, అర్చకులు చలమాచారి బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి అధ్యక్షుడిగా వెంకటేష్



సబితాఇంద్రారెడ్డి నుంచి నియామకపత్రం అందుకుంటున్న వెంకటేష్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నూతన అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలు సోమవారం ఆయనకు నూతన అధ్యక్షుడిగా నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ... బస్తీలు, కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటికి పరిష్కారమార్గాలు చూపిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతామన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు కొలన్ సుభాష్‌రెడ్డి, రమేష్ ముదిరాజ్, రాము యాదవ్, రఘు యాదవ్, సూర్యం, వై.భాస్కర్, అనిల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి



రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బండ్లగూడ: వేసవిలో తాగు నీటి కోసం నెలకొన్న తీవ్ర ఇబ్బందులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్‌లోని హిమగిరి కాలనీ త్రినిటీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వాసులు తమ నీటి సమస్యను తీర్చాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వైభవంగా వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు

లంగర్‌హౌస్: శ్రీరామనవమి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా వైష్ణవ సాంప్రదాయ ప్రకారం మొదటిగా విష్వక్సేనుడి పూజ నిర్వహించి స్వామి వారిని లంగర్‌హౌస్ పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం ఉదయం వేదపండితులు రాజ నర్సింహచారి ఆధ్వర్యంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా చేతుల మీదుగా హోమం, బాల భోగము, ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గరుడ ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్య ఘటాల్లో ఒకటి అయిన శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం నేడు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి హోమాలు విష్ణు సహస్ర పారాయణాలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారిని లంగర్‌హౌస్ పుర వీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించనున్నారు.

వేడుకగా రంజాన్

● ఘనంగా రంజాన్ వేడుకలు
● ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
● కిటకిటలాడిన మసీదులు, ఈద్గాలు



పుప్పాలగూడ మహ్మదీయ మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం నేతలు



రాజేంద్రనగర్ ఈద్గాలో మైనారిటీ నేత మహ్మద్ షమీర్ షరేషీ...

రాజేంద్రనగర్: పవిత్ర రంజాన్ వేడుకలు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. మసీదుల, ఈద్గాల వద్ద వేలాదిగా ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

శంషాబాద్ పట్టణంలో...

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో రంజాన్‌ను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, మాజీ కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పుప్పాలగూడలో...

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రంజాన్‌ను ఘనంగా నిర్వహించారు. పుప్పాలగూడ మహ్మదీయ మసీద్‌లో ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నేతలు ఎం.డి.బషీర్, ఇమామ్, రహీమ్, నూర్, ఫయాజ్, మక్బూల్, ఉస్మాన్, జానీ, అబ్దుల్లా పాల్గొన్నారు.



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

అత్తాపూర్ డివిజన్‌లో...

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. మసీదుల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్తాపూర్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌ల పరిధిలో...

శాస్త్రీపురం: రంజాన్ ప్రార్థనలతో శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్లలోని మసీదులు కిటకిటలాడాయి. బడీమసీద్, చోటామసీద్, నౌనంబర్, ఖయాంనగర్, ఎంఎం పహాడీ, చింతల్‌మెట్, జలాల్‌బాబానగర్, వాదియామహ్మద్ కాలనీ తదితర ప్రాంతాలలో మసీదుల వద్ద ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు. చారిత్రక బడీ మసీదు వద్ద జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు.

అలరించిన బాలనాగమ్మ నాటకం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని ఫిలింఛాంబర్ రామానాయుడు కళామండపంలో ఉగాది నాటకోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే నాటకోత్సవాల్లో సోమవారం ఉయ్యూరుకు చెందిన శ్రీదేవి కళా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన బాలనాగమ్మ జానపద నాటకం అలరించింది. బాలనాగమ్మగా వీరమణి, కార్యవర్ధిగా సోమర ఎర్రస్వామి చౌదరి, ఫకీర్‌గా జెట్టి సాంబశివరావు, పులిరాజుగా ముత్యాల నాగేశ్వర్‌రావు, సంగుగా ఇంద్రజ, తిప్పడుగా ఈగ నాగేశ్వర్‌రావు, లచ్చిగా మనుప్రియ, జంగమ దేవరగా రాధాకృష్ణ నటించారు. రంగస్థల కళాకారులను ప్రోత్సహించడంతో పాటు నేటితరం యువతకు, సినీ ప్రేమికులకు రంగస్థల నాటికలను పరిచయం చేసే ప్రయత్నమే ఈ కార్యక్రమం అని సుబ్బారావు తెలిపారు. ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్, చుక్కపల్లి అవినాష్, సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, చార్టెడ్ అకౌంటెంట్ దేవ నాథ్ సూరి తదితరులు పాల్గొన్నారు.

